RNI No :TELTEL2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు : 4
సంపుటి : 3, సంచిక : 171 | జూన్ 1, 2025 | వెల : రూ.3-00




మేక్ ఇన్ ఇండియా కీలక పాత్ర పోషించింది

3లో..



## న్యాయం కావాలి

- 'ఎంజీఎం' నిపుణుల నివేదిక కోసం బాధితుడి ఎదురుచూపులు
- 'బంధన్' ఘటనపై ఎక్స్‌పర్ట్స్ కమిటీ రిపోర్ట్ వచ్చేదెప్పుడు?
- 8 నెలలు దాటుతున్నా ఫిర్యాదుపై కనీస పట్టింపు లేదు
- ఐఎంఏ సమక్షంలో తప్పు ఒప్పుకున్న సదరు ఆస్పత్రి వైద్యులు!
- ఆ నివేదిక ఆధారంగానే చర్యలు అంటున్న డీఎంహెచ్‌వో!



GOVERNMENT OF TELANGANA (MEDICAL & HEALTH DEPARTMENT)

Yours faithfully

District Medical and Health Officer Hanumakonda

To L.Krishna, Kareemabad, Warangal.

ఎక్స్పర్ట్ కమిటీ నియమించి రిపోర్ట్ ఇవ్వాలని వరంగల్ ఎంజీఎం సూపరింటెండెట్‌ని 16 డిసెంబర్ 2024 తేదీన కోరిన హన్మకొండ డిఎంహెచ్ఓ

**వేద న్యూస్, హన్మకొండ:**

తనకు జరిగిన అన్యాయంపై త్వరితగతిన విచారణ చేపట్టి న్యాయం చేయాలని బంధన్ హాస్పిటల్ బాధితుడు కృష్ణ వేడుకుంటున్నారు. గతేడాది బంధన్ ఆస్పత్రిలో తనకు అన్యాయం జరిగిందని.. పలు విభాగాల అధికారులను కలిసి ఫిర్యాదు చేసినా.. ఇంకా న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్జరీ, పోస్ట్ ఆఫ్ కేర్‌లో 'బంధన్'లో జరిగిన క్షమించరాని నిర్లక్ష్యంతో తాను జీవితపు చరమాంకానికి వెళ్లి బయటపడ్డానని వెల్లడించారు. పవిత్రమైన వైద్య వృత్తిలో ఉండి ప్రాణాలు కాపాడాల్సిన వైద్యులు.. కాసుల కాంక్షతో.. వ్యాపార దృక్పథంతో.. సామాన్యుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని విమర్శిస్తున్నారు. తనకు జరిగిన అన్యాయంపై

మిగతా 4వ పేజీలో..





# భయమే ఆసరా..!

- అందినకాడికి దండుకుంటున్న వైనం
- నిమిషానికి రూ.వేలు, గంటల్లో రూ.లక్షల సంపాదన
- సదరు ప్రైవేటు పిల్లల ఆస్పత్రిలో పైసలే పరమావధి

**వేద న్యూస్, జమ్మికుంట:**

సమయం సుమారు..6.30 గంటలు.. నవజాత శిశువు తల్లి గర్భం నుంచి బయటకు వచ్చింది. జన్మనిచ్చిన తల్లిదండ్రులు, వారి కుటుంబ సభ్యులు సంతోషంలో మునిగి తేలుతున్నారు. అంతలోనే పిల్లల డాక్టర్ బేబీ పుట్టగానే సరిగా ఏడ్వలేదని చెప్పాడు. అంతే ఇక.. సదరు శిశువు కుటుంబీకుల ఆనందం కాస్త భయంగా మారింది. అంతే తల్లి, శిశువు వేరయ్యే సమయం ఆసన్నమైంది. అప్పుడే పుట్టిన బిడ్డను పురిటిలో నుంచి వేరు చేసి ఆ ప్రైవేటు ఆస్పత్రి నుంచి జమ్మికుంటలోని మరో పిల్లల ఆస్పత్రి(ప్రైవేటు)కు తరలించారు. అక్కడ ట్రీట్‌మెంట్ అందుతోందని భావించిన బిడ్డ తండ్రి, కుటుంబీకులకు నిరాశే ఎదురైంది. పరిస్థితి చేయిదాటిపోతోందని బెంబేలెత్తించి.. వరంగల్‌లోని మరో ప్రైవేటు(పిల్లల)ఆస్పత్రికి రెఫర్ చేశారు. సదరు ప్రైవేటు పిల్లల ఆస్పత్రిలో 20 నిమిషాల వైద్యానికి రూ.వేలల్లోనే బిల్లు కట్టేసి.. రెఫర్ చేసిన ఆ ఆస్పత్రికి(వరంగల్) వెళితే.. ఎంట్రీలోనే రూ.20 వేలు అడ్వాన్స్ చెల్లించడం, వారంలో రూ.1 లక్షా 20 వేలు పేమెంట్ కావడం.. చకచకా జరిగిపోయింది. ఇది ఓ బాధితుడి స్టోరీ కాగా, నిత్యం ఇలాంటివి జరుగుతూనే ఉన్నాయి.

సామాన్యుల 'భయమే ఆసరా చేసుకుని' ఈ రీతిన కొందరు ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు 'వైద్యాన్ని' వ్యాపార దృక్పథంతో కొనసాగిస్తున్నారు. 'వైద్యో నారాయణ హరి' అనే నానుడికే సవాల్ విసురుతున్నారు. కరీంనగర్ జిల్లాలోనే వాణిజ్య కేంద్రంగా వర్ధిల్లుతున్న జమ్మికుంట పట్టణంలో ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యుడి నిర్వాకంపై బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు దేవుళ్లని నమ్మే సమాజంలో..పవిత్రమైన వైద్య వృత్తిలో ఉంటూ కమర్షియల్‌గా ఆలోచిస్తూ.. తనకు వేరే చోట ఉన్న మరో ఆస్పత్రిలో పేషెంట్స్ ప్లస్ బిల్లు కోసం రెఫరల్ గేమ్ ఆడుతున్న సదరు వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని బాధితులు వైద్య శాఖ ఉన్నతాధికారులను కోరుతున్నారు.




## వారసుడి న్యాయ పోరాటం

- తండ్రి ఆస్తిలో వాటా కోసం కుమారుడి నిరాహార దీక్ష
- గీసుగొండ మండలం ఎలుకుర్తి (హవేలీ)లో..

**వేద న్యూస్, వరంగల్:**

"రక్తం పంచుకు పుట్టిన తనయుడికి తండ్రి ఆస్తి దక్కకుండా కుటుంబీకులు అడ్డు పడుతుండడంతో.. ఆ ఇంటి వారసుడైన కుమారుడు న్యాయపోరాటం చేస్తున్నాడు. ఊరిలో టెంటు వేసుకొని నిరాహార దీక్ష చేస్తూ.. తనకు న్యాయం చేయాలని ఊరి ప్రజలను, పెద్ద మనుషులను కోరుతున్నాడు." స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా గీసుగొండ మండలం..

ఎలుకుర్తి (హవేలీ) గ్రామానికి చెందిన మిట్టపల్లి శ్రీనివాస్ 17 ఏళ్ల క్రితం మృతి చెందారు. ఆయన కుమారుడైన మిట్టపల్లి అరవింద్ తన తల్లితో కలిసి ఇన్నాళ్లు తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉన్నాడు. అయితే, ఈ సమయంలో తన నానమ్మ బాగోగుల నిమిత్తం ఊరికి వచ్చి పోతూ ఉండేవాడు. నాయనమ్మ బాగోగులను తల్లితో కలిసి అరవింద్ చూసుకోవడంతోపాటు.. నానమ్మ కాలం చేసిన సందర్భంగా

మిగతా 4వ పేజీలో..




## కేసీఆర్ రెండో కన్ను

# జాగృతి




- ఆయనపై ఈగవాలినా ఊరుకోం
- రాజీవ్ గాంధీకి తెలంగాణకు ఏం సంబంధం?: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

జూన్ 2న రాజీవ్ యువ వికాసం పథకం ఎందుకు తెస్తున్నారని, రాజీవ్ గాంధీకి తెలంగాణకు ఏం సంబంధమని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణ యువ వికాసం అని ఉండాలి కానీ, రాజీవ్ యువ వికాసం అని ఉండకూడదని ఆమె అభిప్రాయపడ్డారు.

శనివారం బంజారాహిల్స్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ జాగృతి నూతన కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రజల గొంతుకగా తెలంగాణ జాగృతి సంస్థ పని చేసిందని అన్నారు. కేసీఆర్‌కు రెండు కళ్లలా పని చేస్తామని, ఒక కన్ను బీఆర్ఎస్ అయితే, రెండోది జాగృతి సంస్థ అని తెలిపారు. కేసీఆర్‌పై ఈగ వాలినా ఊరుకోమని, కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారంటే యావత్ తెలంగాణకు నోటీసులు ఇచ్చినట్టే అని మండిపడ్డారు. ఈ రాష్ట్రానికి కేసీఆర్ ఏం చేశారో ప్రజలందరికీ తెలుసని, తెలంగాణ తెచ్చిన వ్యక్తికి నోటీసులు ఇస్తారా? అది కాళేశ్వరం కమిషన్ కాదు, కాంగ్రెస్ కమిషన్ అని ధ్వజమెత్తారు. కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇవ్వడాన్ని నిరసిస్తూ జూన్ 4న ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. మహాధర్నాలో నోటీసుల కుట్ర మొత్తం వివరిస్తామని, గోదావరి-కావేరీ లింకేజీతో నదీ జలాలు తెలంగాణకు శాశ్వతంగా దూరమవుతాయని అన్నారు. కేసీఆర్, ఆచార్య జయశంకర్ స్ఫూర్తితో జాగృతి సంస్థ ఏర్పాటయ్యిందన్నారు. ఈ సంస్థను ప్రారంభించి 18 ఏళ్లు అవుతుందని ఇప్పటి వరకు అశోక్‌నగర్‌లో జాగృతి ఆఫీస్ ఉండేది. ప్రస్తుతం బంజారాహిల్స్‌కు మార్చామని తెలిపారు. ఇకపై ఇక్కడి నుంచే కార్యకలాపాలు కొనసాగిస్తామని తాము చేసిన ఉద్యమాల వల్ల ఎన్నో జీవోలు వచ్చాయని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా జై తెలంగాణ అనాలి.. అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించాలి.. కనీసం రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2వ తేదీన అయినా రేవంత్‌రెడ్డి జై తెలంగాణ అనాలి అని కవిత అన్నారు.




## మిస్ వరల్డ్ 2025 విజేత

# థాయలాండ్ భామ

### ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి :**

72వ మిస్ వరల్డ్ పోటీల్లో థాయ్‌లాండ్‌కు చెందిన ఓపల్ సుచాత చువాంగ్ శ్రీ విజేతగా నిలిచింది. మిస్ వరల్డ్ 2025 కిరీటాన్ని కైవసం చేసుకుంది. 107 దేశాలకు చెందిన అందాల భామలతో పోటీ పడి సుచాత విజేతగా నిలిచింది. మిస్ వరల్డ్ కిరీటాన్ని గెలిచిన మొదటి థాయ్‌లాండ్ దేశస్తురాలు సుచాత కావటం విశేషం. సుచాత 2003, సెప్టెంబర్ 20వ తేదీన థాయ్‌లాండ్‌లోని ఫుకెట్‌లో జన్మించింది. కజోన్‌కిట్సుకా స్కూల్లో ప్రైమరీ, సెకండరీ ఎడ్యుకేషన్ పూర్తి చేసింది. ప్రస్తుతం పాలిటిక్స్, ఇంటర్ నేషనల్ రిలేషన్స్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ చేస్తోంది. 2021 నుంచి అందాల పోటీల్లో పాల్గొంటోంది. గతంలో మిస్ యూనివర్స్ థాయ్‌లాండ్ 2024 విజేతగా నిలిచింది.



# లోక్ అదాలత్ లతోనే సత్వర న్యాయం

**వేద న్యూస్, కోరుట్ల ప్రతినిధి :**



లోక్ అదాలత్ లతోనే సత్వర న్యాయం, సమ న్యాయం జరుగుతుందని సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు అన్నారు. శనివారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కో ఆర్డినేషన్ సమావేశం లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ జూన్ 14 నా జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ఉందని, ఇట్టి కార్యక్రమం లో అధిక సంఖ్యలో సివిల్ మరియు క్రిమినల్ కేసుల్ని రాజీ ద్వారా పరిష్కారించుకోవడానికి పోలిసులు, న్యాయవాదులు సహకరించాలని కోరారు. ఇట్టి సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి నారం అరుణ్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షులు తోగిటి రాజ శేఖర్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెర్లపల్లి ఆనంద్ గౌడ, లోక్ అదాలత్ మెంబర్ జేడి సుధాకర్, న్యాయవాదులు కోటగిరి వెంకటస్వామి, పడిగేలా శ్రీనివాస్, గురిజెలా గోపి, మెట్ పల్లి, కోరుట్ల సీఐ లు, ఎస్సైలు పాల్గొన్నారు.

# బీసీలకు తీరని అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

**వేద న్యూస్, వరంగల్ జిల్లా :**



**– తాటిపాముల వెంకట్రాములు**

కేంద్ర ప్రభుత్వం 10శాతం లేని అగ్రకులాలకు ప్రభుత్వ విద్య, ఉద్యోగాలలో 10 శాతం రిజర్వేషన్ కల్పించి అమలు జరుపుతున్నందున దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు తీరని అన్యాయం జరుగుతున్నదని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఆవేదన వ్యక్తం చేశారు. 53శాతం ఉన్న బీసీలకు కేవలం 27 శాతం రిజర్వేషన్లు అమలు జరపడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. జనాభా ప్రాతిపదికగా రిజర్వేషన్ కల్పించాలని దేశవ్యాప్తంగా బీసీ సంఘాలు ఉద్యమాలు చేస్తున్న పట్టించుకోని కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అగ్రకుల పేదల కోసమని ఆగమేఘాల మీద 10శాతం రిజర్వేషన్ తెచ్చి అమలు జరుపుతుండటమేంటని ఆయన ప్రశ్నించారు. బీసీ ప్రధానమంత్రినని పదేపదే గొప్పగా చెప్పుకుంటున్న నరేంద్ర మోడీ పాలనలో బీసీలకు అన్ని రంగాలలో తీరని అన్యాయం జరుగుతూనే ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి బీసీల ఎడల ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న తక్షణమే అగ్రకులాల పేదల కోసమని చేసిన పది శాతం రిజర్వేషన్లు రద్దు చేసీ తమ చిత్తశుద్ధిని నిరూపించు కోవాలన్నారు. దేశవ్యాప్తంగా బీసీ సంఘాలు డిమాండ్ చేసినట్టుగా కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కలిగించాలని, మహిళా రిజర్వేషన్ల లోబీసీ కోటా నిర్ణయించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశ జనగణలో కులగణన చేస్తామని ప్రకటించిన కేంద్రం ఆ ప్రక్రియను వెంటనే ప్రారంభించి నిర్ణీత కాల వ్యవధిలో పూర్తిచేయాలని వెంకట్రాములు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కేవలం ప్రకటనలతో మభ్యపెడుతూ ప్రచార ఆర్భాటాలతో కాలయాపన చేస్తే బీసీల ఉద్యమాలు ఉధృతమవుతాయని ఆయన హెచ్చరించారు.

# సేంద్రియ పద్ధతిలో పంటలు పండించాలి

**వేద న్యూస్,శాయంపేట :**



శాయంపేట మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా రైతులకు రాబోయే వానాకాలం, యాసంగి లో చేపట్టవలసిన కార్యక్రమాలను వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు కొన్ని సూచనలు చేశారు.పంట మార్పిడి ద్వారా వివిధ రకాల తెగుళ్లను అరికట్టవచ్చని తెలిపారు. సేంద్రియ వ్యవసాయం దాని వల్ల ఉపయోగాలు వివరించారు. ఎరువులు నీటి యాజమాన్యం గురించి వివరించారు. వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి పరిశ్రమ గొర్రెల పెంపకం, కోడి పరిశ్రమ యొక్క ఉపయోగాలు తెలిపారు. రసాయనాల వాడకాన్ని తగ్గించి సేంద్రియ పద్ధతిలో పంటలు పండించడం ద్వారా నేల యొక్క ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అన్నారు. విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలని సూచించారు. విత్తన ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సమీకృత వ్యవసాయ విధానం పాటించినట్లయితే సంవత్సరం పొడవునా ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. వేసవిలో లోతు దుక్కులు దున్నడం ద్వారా భూమిలో ఉన్నటువంటి హానికర పురుగుల గుడ్లను నిర్మూలం చేయవచ్చని తెలిపారు. డ్రిప్పు పద్ధతిలో నీటి యాజమాన్యం పాటించినట్లయితే నీటి వృధాని అరికట్టవచ్చు అని చెప్పారు.పత్తి ,మొక్కజొన్న , మిర్చి పంటలపై ఆశించే వివిధ రకాల చీడపీడలు వాటి నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలపై రైతులు అడిగిన సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యమంలో మండల వ్యవసాయ అధికారి గంగాజమున, వెటర్నరీ సైంటిస్ట్ కెవికె మామునూర్ డాక్టర్ ఎం సురేష్, ప్రధాన శాస్త్రవేత్త ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్ రీసెర్చ్ హైదరాబాద్, ఎన్.సాయి చంద్ యంగ్ ప్రొఫెషనల్, రైతులు పాల్గొన్నారు.



# డిఆర్ఎఫ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

**– నగర మేయర్ గుండు సుధారాణి**

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**

వర్షాకాలం నేపథ్యంలో డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డి ఆర్ ఎఫ్) సిబ్బంది నిరంతరం అప్రమత్తం గా ఉండాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శనివారం హనుమకొండ లోని నక్కలగుట్ట సర్కిల్ కార్యాలయ ఆవరణలో గల డిఆర్ఎఫ్ కార్యాలయంతో పాటు నర్సరీ నీ మేయర్ క్షేత్ర స్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేసి సమర్ధవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ కార్యాలయంలో ఉన్న బోట్లను పరిశీలించి వాటి పని తీరును స్థితి గతులను (కండిషన్) అడిగి తెలుసుకోవడం తో పాటు సిబ్బంది తో మాట్లాడి విధి నిర్వహణ తీరును అడిగితెలుసుకున్నారు. నర్సరీ నీ సందర్శించిన మేయర్ ఇందులో పెంచబడుతున్న మొక్కల రకాలను సిబ్బందిని అడిగి తెలుసుకొని రాబోవు వనమహోత్సవాన్ని దృష్టి లో ఉంచుకొని ఎక్కువ మొత్తం లో మొక్కలను పెంచాలని మొక్కల పెంపకానికి అందజేతకు సంబంధించిన రికార్డులను సక్రమం గా నిర్వహించాలని మేయర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎస్ఈ, సిపిలు శ్రీనివాస్, రవీందర్ రాడేకర్, ఈఈ లు రవికుమార్, మాధవి లత, ఏసిపి రజిత, డిఈ రాజ్ కుమార్, టిపిఎస్ రోజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 3 నుండి 20 వరకు రెవెన్యూ సదస్సులు

**– కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 3 నుండి 20 వరకు జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. శనివారం ఆమె ఉదయాదిత్య భవన్లో తహసీల్దార్లు , సర్వేయర్లు,సీనియర్ ,జూనియర్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు తో రెవెన్యూ సదస్సుల నిర్వహణ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. రెవెన్యూ సేవలను సరళతరం చేయడం, ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు గాను ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నదని, అంతేకాక రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన భూ భారతి చట్టం-2025 ను పకడ్బందీగా అమలు చేసేందుకు ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ సదస్సులు నిర్వహించే వివరాలను ముందుగానే ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం చేయాలని, ఆయా గ్రామాలలో నిర్వహించే సదస్సులకు ఒక రోజు ముందే టాం,టాం ద్వారా ప్రచారం కల్పించాలని, అంతేకాక ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా, వాట్సాప్ ల ద్వారా ప్రచారం చేయాలన్నారు.రెవెన్యూ సదస్సులు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు నిర్వహించాలని, ప్రతిరోజు సాయంత్రం ఆర్డీవో కార్యాలయంలో ఆ రోజు వచ్చిన దరఖాస్తులపై చర్చించాలని తెలిపారు. దరఖాస్తుల డేటా కోసం ప్రత్యేకంగా డేటా ఎంట్రీ ఆపరేటర్ ను నియమించాలన్నారు.రెవెన్యూ సదస్సుల నిర్వహణకు గాను ప్రతి మండలంలో రెండు బృందాలుగా ఏర్పడి ఒక బృందానికి తహసిల్దార్,మరో బృందానికి నాయబ్ తహసీల్దార్ నాయకత్వం వహించాలని, బృందంలో ఆర్ ఐ, సర్వేయర్, సీనియర్,జూనియర్ అసిస్టెంట్ ,డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉండేలా చూడాలన్నారు. రెవెన్యూసదస్సులు నిర్వహించే చోట టెంటు, కుర్చీలు, ఫ్లెక్సీ బ్యానర్ లు ,హెల్ప్ డెస్క్ లు ,దరఖాస్తులు స్వీకరించేందుకు దరఖాస్తుల స్వీకరణ కేంద్రం, సరిపోయినన్ని ప్రింటు దరఖాస్తులు, భూములకు సంబంధించిన అన్ని రిజిస్టర్ లను వెంట తీసుకు వెళ్లాలని చెప్పారు. దరఖాస్తు స్వీకరించిన తర్వాత దరఖాస్తుదారులకు రశీదు ఇవ్వాలని, దరఖాస్తులను ఆయా కేటగిరీల వారీగా విభజించి ప్రతిరోజు దరఖాస్తులకు సంబంధించిన వివరాలను తెలియజేయాలని ఆదేశించారు. అంతేకాక చిన్న మండలాలలో దరఖాస్తులు తక్కువగా వచ్చిన చోట చదివి సిద్దంగా ఉంచుకోవాలని,

దరఖాస్తులు అన్నింటిని జాగ్రత్తగా భద్రపరచాలని అన్ని అంశాల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని

అన్ని రిజిస్టర్లు జాగ్రత్తగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఇతర రెవెన్యూ అంశాలను సమీక్షిస్తూ..రాష్ట్ర ప్రభుత్వం జూన్, జూలై, ఆగస్టు మాసాల కు సంబంధించి రేషన్ బియ్యాన్ని ఒకేసారి లబ్ధిదారులకు ఇవ్వాలని



ఆదేశించినందున 3 నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి పంపిస్తున్నారని, తహసిల్దార్లు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని, రేషన్ బియ్యాన్ని చౌక ధరల దుకాణాల లోనే ఉంచేలా చర్యలు తీసుకోవాలని, 3 నెలల బియ్యం పంపిణీ విషయాన్ని అందరికీ తెలియజేసి తీసుకు వెళ్ళాలా చూడాలని కోరారు.బియ్యం అందుబాటులో ఉండేలా చూడాలని, ఈ విషయంపై తక్షణమే డీలర్లతో సమావేశం నిర్వహించాలని,సన్న బియ్యం పంపిణీ పై ఎట్టి పరిస్థితులలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 2 న గ్రామస్థాయి మొదలుకొని, జిల్లా కేంద్రం వరకు అన్ని ప్రభుత్వ కార్యాలయంలో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల నిర్వహణ పై ముందే గ్రామాలలో ప్రచారం చేయాలని చెప్పారు. దరఖాస్తులను ఏవిధంగా పూరించాలో వివరించారు.ప్రతి దరఖాస్తుకు గ్రామాల వారిగా రసీదు ఇవ్వాలని, దరఖాస్తులు కేటగిరీ వారీగా విభజించుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి కార్యాలయం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులు, ప్రజావాణి ఫిర్యాదులు, కోర్టు కేసులు,ప్రజావాణి పిటిషన్లు, ఎలక్షన్ కు సంబంధించిన విషయాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,నల్గొండ ఆర్ డి ఓ అశోక్ రెడ్డి ,దేవరకొండ ఆర్ డి ఓ రమణారెడ్డి లు మాట్లాడారు. పైలెట్ మండలం నకిరేకల్ తహసిల్దార్ జహీర్, నకిరేకల్ మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల అనుభవాలను సమావేశానికి హాజరైన వారికి తెలియజేశారు.

# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించాలి



**– కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వేద న్యూస్, వరంగల్ జిల్లా :**

వరంగల్ కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం నిర్వహించిన సమన్వయ సమావేశం లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి పాల్గొని రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను వైభవంగా, అట్టహాసంగా నిర్వహించేందుకు అన్నిశాఖల సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఖుషి మహల్ లో ఏర్పాటు చేయనున్న జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను అధికారికంగా నిర్వహించుటకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జ్ మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి, రానున్న సందర్భంగా పకడ్బందీ ఏర్పాటు చేయవలసిందిగా సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. వేదిక ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాలు,వివిధ శాఖల సంక్షేమ అభివృద్ధి స్టాల్స్ , మరియు శకటాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, అట్టి ఏర్పాట్లు రేపటి వరకు పూర్తి చేయవలసిందిగా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయలక్ష్మి, వరంగల్ ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, నర్సంపేట ఆర్డిఓ ఉమారాణి, జడ్పీ సీఈవో రామ్ రెడ్డి హౌసింగ్ పీడీ గణపతి డిఆర్డిఓ కౌసల్య దేవి , వరంగల్ మరియు ఖిలా వరంగల్ తాసిల్దార్లు సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వేద న్యూస్



# సంపాదకీయం

## అచేతనంగా ఐక్యరాజ్యసమితి

డొనాల్డ్ ట్రంప్ రెండవసారి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత, ఆయన విధానాలు ఐక్యరాజ్యసమితి (యుఎన్) దాని భద్రతా మండలి, ఇతర సంస్థలు గణనీయంగా బలహీనడినాయి. ఉక్రెయిన్- రష్యా యుద్ధం, ఇజ్రాయెల్ - గాజా (పాలస్తీనా) సంఘర్షణలు మానవ హక్కుల ఉల్లంఘనలు, మానవ జాతి హననం వైపు దారితీస్తున్నాయి. ఈ యుద్ధాలు అమెరికా నుండి ప్రత్యక్ష, పరోక్ష ఆర్థిక, ఆయుధ సహాయంతో సంవత్సరాలుగా కొనసాగుతున్నాయి. ప్రపంచంలో ఉగ్రవాదులకు నిలయాలుగా ఉన్న పాకిస్తాన్, అఫ్ఘానిస్తాన్ మొదలైన దేశాల్లో వారిని పెంచి పోషించింది అమెరికానే. వారికి ఆర్థిక సహాయం చేసింది, ఆయుధాలు సమకూర్చిందీ, సైనిక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించిందీ అమెరికానే. ఈ సంఘర్షణలలో వేలాది సైనికులు, సామాన్య పౌరులు, మహిళలు, పిల్లలు, వృద్ధులు మరణిస్తున్నారు. గాజాలో ప్రజలు ఆకలి మంటలతో అల్లాడుతున్నారు, గాయాలతో సతమతమవుతున్నారు. ఇజ్రాయెల్ బాంబులతో వైమానిక దాడులు, అక్కడ ప్రజలకు తాగటానికి నీరు, తినటానికి ఆహారం, గాయాలకు, రోగాలకు ఔషధాలు అందకుండా చేస్తుంది. వారికి నిలువనీడ లేకుండాపోయింది. ప్రాణభయంతో వృద్ధులు, స్త్రీలు, పిసిపిల్లలతో పడుతూ, లేస్తూ పరుగులు పెడుతున్నారు. స్కూళ్లు, వైద్యశాలలు, ప్రార్థనా మందిరాలు ఇజ్రాయెల్ బాంబులతో ధ్వంసమయ్యాయి. ఈ ఇజ్రాయెల్ క్రూరత్వం వెనుక అండదండలు అందించేది అమెరికానే. ప్రపంచ దేశాలు మానవత్వం మరచి ఈ రెండు దేశాలను ఎదిరించలేక చేతులుకట్టుకుని, చేవచచ్చి చోద్యం చూస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి, ఇతర సభ్యదేశాల నుండి వచ్చే వైద్య సహాయాన్ని, ఆహారాన్ని ఇజ్రాయెల్ సైన్యం రాక్షసత్వం తో అడ్డుకుంటోంది. ఈ పరిస్థితులు ప్రపంచ శాంతి, స్థిరత్వాన్ని దెబ్బతీస్తున్నాయి. ట్రంప్ రెండవ పర్యాయంలో అమెరికా ఐక్యరాజ్యసమితి నుండి దూరమై, దాని నిధులను గణనీయంగా తగ్గించింది. 2025 ఫిబ్రవరిలో ట్రంప్ పరిపాలన ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి (యుఎన్‌హెచ్‌ఆర్‌సి) నుండి ఉపసంహరించుకుని, పాలస్తీనా శరణార్థుల కోసం ఐక్యరాజ్యసమితి రిలీఫ్ అండ్ వర్క్ ఏజెన్సీ (యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ) నిధులను నిలిపివేసింది. అమెరికా, ఐక్యరాజ్యసమితి బడ్జెట్‌లో దాదాపు 25 శాతం వాటాను సమకూర్చే ప్రధాన దాతగా, ఈ నిధుల కోతలు యుఎన్ మానవతా కార్యక్రమాలను తీవ్రంగా దెబ్బతీశాయి. ఉదాహరణకు, యుఎన్ వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్ మయన్మార్‌లో సహాయాన్ని తగ్గించవలసి వచ్చింది. భద్రతా మండలిలో అమెరికా వీటో అధికారాన్ని ఉపయోగించి, గాజాలో మానవతా కోణంలో యుద్ధ విరామం కోసం ఉద్దేశించిన ప్రతిపాదనలను అడ్డుకుంది. 2023 అక్టోబర్‌లో బ్రెజిల్ ప్రతిపాదించిన ఒక తీర్మానం, గాజాలో మానవతా సహాయానికి అవసరమైన విరామం కోసం పిలుపునిచ్చినప్పటికీ అమెరికా వీటో కారణంగా విఫలమైంది. ఈ చర్యలు ఐక్యరాష్ట్రాల సంస్థ శాంతి స్థాపన లక్ష్యాలను అమలు చేయడంలో విఫలమవడానికి దోహదపడ్డాయి. ఇప్పుడు అమెరికా నిధులు మంజూరు చేయకపోవడంతో ఐక్యరాజ్యసమితి నిర్వీర్యం అయింది. ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు ఏకగ్రీవంగా ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై యుద్ధం పేరుతో పసిబిడ్డలతో సహా మానవ మారణకాండను కొనసాగిస్తున్నందుకు అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అయినా తన వీటో పవర్‌తో అడ్డుకుంటుంది. ఉక్రెయిన్- రష్యా యుద్ధంలో ట్రంప్ పరిపాలన ఉక్రెయిన్‌కు సైనిక సహాయాన్ని నిలిపివేసి రష్యాతో శాంతి చర్చలను ప్రోత్సహించింది. 2025 ఫిబ్రవరిలో అమెరికా రష్యాతో రియాద్‌లో చర్చలు జరిపింది, ఉక్రెయిన్‌ను ప్రక్కన పెట్టి. ఈ చర్యలు ఉక్రెయిన్ భూభాగ సార్వభౌమత్వాన్ని రాజీచేసే అవకాశం ఉందని విమర్శలు వచ్చాయి. యుద్ధం కారణంగా ఐరోపాలో రక్షణ ఖర్చులు పెరిగాయి. నాటో భవిష్యత్తు అనిశ్చితంగా మారింది. ఈ యుద్ధం ప్రపంచ ఆర్థిక స్థిరత్వాన్ని, శక్తి సరఫరాను, ఆహార భద్రతను దెబ్బతీసింది. గాజా సంఘర్షణలో, ట్రంప్ విధానాలు ఇజ్రాయెల్‌కు అనుకూలంగా, పాలస్తీనియన్లకు వ్యతిరేకంగా ఉన్నాయి. 2025 ఫిబ్రవరిలో, ట్రంప్ గాజాను 'మధ్యధరా రివియెరా'గా మార్చడానికి పాలస్తీనియన్లను ఈజిప్ట్, జోర్డాన్‌కు బలవంతంగా తరలించాలని ప్రతిపాదించాడు. దీనిని ఐక్యరాజ్యసమితి సంస్థ జాతి శుద్ధీకరణగా ఖండించింది. ఈ ప్రతిపాదన అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే కాక, ఈజిప్ట్, జోర్డాన్‌తో ఇజ్రాయెల్ శాంతి ఒప్పందాలను దెబ్బతీసే ప్రమాదం ఉంది. గాజాలో 47,552మంది పౌరులు మరణించారు. 111,629 మంది గాయపడ్డారు. ఇజ్రాయెల్ కక్షకట్టి బాంబు దాడులు చేస్తూనే ఉంది, ఎవరు హితబోధ చేసినా వినే పరిస్థితిలో లేదు. ఈ యుద్ధాలు పర్యావరణ విధ్వంసాన్ని కలిగించాయి. గాజాలో 69 శాతం భవనాలు ధ్వంసమయ్యాయి. 92 శాతం గృహాలు, 88 శాతం పాఠశాలలు నాశనమయ్యాయి. బాంబు దాడులు, అలాగే ఇంధన వినియోగం వాయు కాలుష్యాన్ని పెంచాయి. ఉక్రెయిన్ యుద్ధం శక్తి సరఫరా గొలుసులను అడ్డుకుంది, శిలాజ ఇంధనాలపై ఆధారపడటాన్ని పెంచింది, ఇది వాతావరణ మార్పులను తీవ్రతరం చేసింది. ట్రంప్ విధానాలు ఐక్యరాష్ట్రాల సంస్థను బలహీనపరిచి, ప్రపంచ శాంతి, స్థిరత్వాన్ని దెబ్బతీశాయి. అమెరికా ఏకపక్ష చర్యలు, నిధుల కోతలు, ఇజ్రాయెల్‌కు అనుకూల వైఖరి సంఘర్షణలను మరింత తీవ్రతరం చేశాయి. ఐక్యరాష్ట్రాల సంస్థ ఆదర్శాలు, లక్ష్యాలు అమలుకు నోచుకోవడం లేదు. ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి, సభ్యదేశాలు సమష్టిగా బాధ్యత తీసుకొని, అంతర్జాతీయ చట్టాలను గౌరవించే విధంగా శాంతి చర్చలను ప్రోత్సహించాలి. ప్రపంచ శాంతికోసం ఐక్యరాష్ట్రాల సంస్థ బలోపేతం కావాలి. లేకపోతే మానవతా సంక్షోభాలు మరింత తీవ్రమవుతాయి.

## యువతిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ యూట్యూబర్ తోపాటు మహిళపై కేసు..!

**వేద న్యూస్, డెస్క్:**

తిరుపతిలో లైంగిక వేధింపులకు పాల్పడ్డ యూట్యూబర్ పై కేసు నమోదు అయ్యింది. యూట్యూబర్ కల్లూరి హేమాద్రి తోపాటు నాగవర్ధిని అనే మహిళ పై కూడా తిరుచానూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. తిరుపతి రూరల్ మండలం మంగళం క్వార్టర్స్‌లో ఉంటున్న యువతిని లైంగిక వేధింపులకు గురి చేసినట్లు ఫిర్యాదు అందింది. దీంతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హేమాద్రి ఇన్ స్టాగ్రామ్, ఫేస్బుక్, వాట్సప్ ద్వారా యువతికి అసభ్య మెసేజ్‌లు చేసి ఇబ్బంది పెట్టినట్లు పోలీసులకు ఇచ్చిన పిర్యాదులో బాధితురాలు పేర్కొంది. గత 5 నెలలుగా తన కోరిక తీర్చాలని వేధింపులకు గురి చేస్తున్నాడని బాధితురాలు ఫిర్యాదు చేసింది. నువ్వంటే పిచ్చని లొంగకపోతే జీవితాన్ని నాశనం చేస్తానని బెదిరించినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో స్పష్టం చేసింది. లేదంటే కుటుంబ సభ్యులను కూడా చంపుతానని బెదిరించినట్లు పోలీసులకు బాధితురాలు తెలిపింది.

ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియా లో పోస్ట్ చేస్తానని కల్లూరి హేమాద్రి బెదిరింపులకు పాల్పడినట్లు పోలీసుల విచారణలో బాధితురాలు స్టేట్‌మెంట్ ఇచ్చింది. మంగళం క్వార్టర్స్ లో ఉన్న వివాహితను నాగవర్ధిని ఇంటికి పిలిపించి బెదిరించిన యూట్యూబర్ కల్లూరి హేమాద్రి బ్లాక్ మెయిల్‌కు పాల్పడినట్లు గుర్తించిన పోలీసులు ఈ మేరకు యూట్యూబర్ హేమాద్రి అతని సన్నిహితురాలు నాగవర్ధని ఇద్దరినీ అదుపులో తీసుకుని విచారణ చేపట్టారు. నిందితుడు గతంలోనూ ఇలాంటి ఘటనకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసలు దర్యాప్తు చేపట్టారు.



## కేరళలో కొనసాగుతున్న
# భారీ వర్షాలు

**వేద న్యూస్, తిరువనంతపురం :**



కేరళలో భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. దీంతో రాష్ట్రంలో అన్ని నదులు ఉధృత స్థాయిలో ప్రవహిస్తున్నాయి. ప్రజల్ని ప్రభుత్వం అప్రమత్తం చేసింది. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలిస్తున్నారు. కాగా, రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాలకు భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శుక్రవారం రెడ్ అలర్ట్ జారీ చేసింది. అతి భారీ వర్షాలు (24 గంటల్లో 20 సెం.మీ కంటే ఎక్కువ) కురిసే అవకాశం ఉంటే రెడ్ అలర్ట్ జారీ చేస్తారు. పతనంతిట్ట, అలప్పుజ, కొట్టాయం, ఎర్నాకుళం, ఇడుక్కి, త్రిస్సూర్, కన్నూర్, కాసరగోడ్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. మిగిలిన ఆరు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ (భారీ నుంచి అతి భారీ వర్షాలు) జారీ చేసింది. మొత్తంగా 14 జిల్లాల్లోనూ శనివారం వరకూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కనీసం జూన్ 3 వరకూ కేరళలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అలాగే, గత వారం రోజుల్లో కేరళలో 'అధిక వర్షపాతం' నమోదయిందని ఐఎండీ తెలిపింది. సాధారణంగా ప్రతీఏటా కేరళకు జూన్ 1వ వచ్చే నైరుతి రుతుపవనాలు ఈ సారి మే 24నే కేరళలో ప్రవేశించాయి. ఇదిలా ఉండగా, పశ్చిమ బెంగాల్, బంగ్లాదేశ్ తీరాల్లో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం రాబోయే 12 గంటల్లో క్రమంగా బలహీనపడి, తదుపరి 24 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందని శుక్రవారం మధ్యాహ్నం 1 గంటకు ఐఎండీ తెలిపింది.

## ఒకే షిఫ్ట్‌లో నీట్ పీజీ పరీక్ష



**వేద న్యూస్, న్యూఢిల్లీ :**

నీట్ పీజీ 25 ప్రవేశ పరీక్ష విషయంలో సుప్రీం కోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఒకే షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ ప్రవేశ పరీక్షను జూన్ 15న రెండు విడతల్లో నిర్వహించి, జులై 15 న ఫలితాలు విడుదల చేస్తామని నేషనల్ ఎగ్జామినేషన్ బోర్డు ( ఎన్‌ఈబీ) ప్రకటించిన నేపథ్యంలో ఈ ఆదేశాలు వచ్చాయి. పరీక్షను రెండు విడతల్లో నిర్వహించడం వల్ల ప్రశ్నల క్లిష్టత స్థాయి మారి కొందరు విద్యార్థులు నష్టపోయే అవకాశం ఉందని ఎన్‌ఈబీ నిర్ణయంపై ఆందోళన వ్యక్తమైంది. అందుకే దానిని ఒకే విడతలో నిర్వహించేలా బోర్డ్‌ను ఆదేశించాలని కోరుతూ సుప్రీం లో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వాటిపై విచారణ జరిపిన కోర్టు ఈ ఆదేశాలు ఇచ్చింది. అయితే ఒకే షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహణ కోసం కేంద్రాలు ,సమయం సరిపోదంటూ ఎన్‌ఈబీ వినిపించిన వాదనను సుప్రీం తోసిపుచ్చింది. జూన్ 15న పరీక్ష నిర్వహణ కోసం ఏర్పాట్లు చేసేందుకు తగిన సమయం ఉందని వ్యాఖ్యానించింది.


## మేక్ ఇన్ ఇండియా కీలక పాత్ర పోషించింది

**వేద న్యూస్, న్యూఢిల్లీ :**



కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఆపరేషన్ సిందూర్ లో మేక్ ఇన్ ఇండియా పాత్రను ప్రశంసించారు. అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రోగ్రామ్ ద్వారా, ప్రైవేట్ రంగం మొదటిసారిగా రక్షణ ప్రాజెక్ట్‌లో భాగస్వామ్యం పొందుతుందని తెలిపారు. స్వదేశీ రక్షణ సామర్థ్యాన్ని బలోపేతం చేయడం దీని ముఖ్య ఉద్దేశ్యం. ఆపరేషన్ సిందూర్ సమయంలో మేక్ ఇన్ ఇండియా కీలక పాత్ర పోషించిందని కేంద్ర రక్షణా శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రోగ్రామ్ ఎగ్జిక్యూషన్ మోడల్ ద్వారా, ప్రైవేట్ రంగానికి మొదటిసారిగా ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు మెగా డిఫెన్స్ ప్రాజెక్ట్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుందని, ఇది స్వదేశీ రక్షణ సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తుందని ఆయన అన్నారు. గురువారం(మే 29) న్యూఢిల్లీలో జరిగిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ వార్షిక వ్యాపార సదస్సు ప్రారంభ ప్లీనరీలో రాజ్‌నాథ్ పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ.. భారతదేశంలో 5వ తరం యుద్ధ విమానాలను నిర్మించడానికి ఉద్దేశించిన ఎఎంసిఎ కార్యక్రమానికి అమలు నమూనాను ఒక సాహసోపేతమైన, నిర్ణయాత్మక అడుగుగా మంత్రి అభివర్ణించారు. ఎఎంసిఎ ప్రాజెక్ట్ కింద ఐదు నమూనాలను అభివృద్ధి చేయాలనేది ప్రణాళిక, దీని తరువాత సిరీస్ ఉత్పత్తి జరుగుతుంది. ఇది మేక్-ఇన్-ఇండియా కార్యక్రమం చరిత్రలో కీలకమైన మైలురాయి అని ఆయన పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో మేక్-ఇన్-ఇండియా విజయాన్ని ప్రస్తావిస్తూ.. దేశం తన స్వదేశీ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసుకోకపోతే పాకిస్తాన్, పీఓకేలలో ఉగ్రవాదంపై భారత సాయుధ దళాలు సమర్థవంతమైన చర్య తీసుకోలేకపోయేవని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. పీఓకే భారతదేశంలో భాగమని, భౌగోళికంగా, రాజకీయంగా విడిపోయిన ప్రజలు ముందుగానే లేదా తరువాత స్వచ్ఛందంగా భారతదేశానికి తిరిగి వస్తారని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు.

### ఆపరేషన్ సిందూర్‌పై కామెంట్లు
## లా స్టూడెంట్ అరెస్ట్



**వేద న్యూస్, డెస్క్:**

పహల్గామ్ ఉగ్రదాడిలో పసుపు, కుంకుమలు కోల్పోయిన వారికి న్యాయం చేయటం కోసం భారత ఆర్మీ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన సంగతి తెలిసిందే. పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలను భారత ఆర్మీ ధ్వంసం చేసింది. ఈ దాడుల్లో 100 మందికి పైగా ఉగ్రవాదులు చనిపోయారు. భారత ఆర్మీ చేపట్టిన ' ఆపరేషన్ సిందూర్'పై దేశ ప్రజలు ప్రశంసల వర్షం కురిపించారు. అయితే, కొంతమంది మాత్రం అనవసరంగా నోరు పారేసుకున్నారు. ఆపరేషన్ సిందూర్ గురించి తప్పుగా మాట్లాడారు. పుణెకు చెందిన శర్మిష్ట పనోలి అనే లా స్టూడెంట్ కూడా ఆపరేషన్ సిందూర్ గురించి తప్పుగా మాట్లాడింది. ఈ మేరకు తన సోషల్ మీడియా ఖాతాలో కొన్ని రోజుల క్రితం ఓ పోస్టు పెట్టింది. ఓ మతాన్ని టార్గెట్ చేస్తూ కామెంట్లు చేసింది. ఆ వీడియో కాస్తా వైరల్‌గా మారింది. దీంతో తీవ్ర దుమారం చెలరేగింది. నెటిజన్లు ఆమెపై ఫైర్ అయ్యారు. తాను తప్పు చేశానని గుర్తించిన శర్మిష్ట వీడియోను వెంటనే డిలీట్ చేసింది. తన ఎక్స్ ఖాతాలో ఓ క్షమాపణ పోస్టు పెట్టింది. ' నాకు ఎవర్నీ బాధ పెట్టాలన్న ఉద్దేశ్యం లేదు. ఆ వ్యాఖ్యలు కేవలం నా వ్యక్తిగతం మాత్రమే. నా వ్యాఖ్యలు ఇబ్బంది పెట్టి ఉంటే క్షమించండి' అని పేర్కొంది. అయితే, అప్పటికే పరిస్థితి చెయ్యిదాటి పోయింది. ఆపరేషన్ సిందూర్‌పై ఆమె చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై కోల్‌కతాలోని ఓ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. శుక్రవారం కోల్‌కతా పోలీసులు షర్మిష్టను గురుగ్రాములో అరెస్ట్ చేశారు. ఈ రోజు(శనివారం) ఆమెను అలీపోర్ కోర్టులో హాజరుపరిచారు. శర్మిష్ట అరెస్ట్‌పై పోలీసులు మాట్లాడుతూ.. ' శర్మిష్టకు, ఆమె కుటుంబానికి చాలా సార్లు నోటీసులు పంపాము. ఎవరూ పట్టించుకోలేదు. తప్పించుకుని తిరుగుతూ ఉన్నారు. ఈ నేపథ్యంలోనే కోర్టు అరెస్ట్ వారెంట్ ఇచ్చింది. శుక్రవారం గురుగ్రాములో ఆమెను అరెస్ట్ చేశాము' అని తెలిపారు.

## గాజా పట్ల ఇజ్రాయెల్
# తన వైఖరి మార్చుకోవాలి

**వేద న్యూస్, డెస్క్:**

గాజా పట్ల ఇజ్రాయెల్ తన వైఖరి మార్చుకోవాలని ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ సూచించారు. కచ్చితంగా పాలస్తీనా దేశం ఉండాల్సిందేనని మాక్రాన్ తేల్చి చెప్పారు. గాజాలో మానవీయ సాయాన్ని అడ్డుకోవడం భావ్యం కాదని.. ఇలాగైతే టెల్ అవీవ్‌పై కఠిన వైఖరి అవలంభించాల్సి వస్తోందని ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ హెచ్చరించారు. రెండు దేశాల సిద్ధాంతానికి ఫ్రాన్స్ కట్టుబడి ఉందని తేల్చిచెప్పారు. సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్‌తో కలిసి మాట్లాడుతుండగా మాక్రాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇదిలా ఉంటే తాజాగా అమెరికా సాయంతో ఇజ్రాయెల్.. హమాస్‌కు కొత్త ప్రతిపాదన పెట్టింది. 60 రోజుల కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ అంగీకరిస్తూ బందీలను విడుదల చేయాలని హమాస్ ముందు ప్రతిపాదన పెట్టగా తిరస్కరించింది. అమెరికా ప్రతిపాదన పూర్తి వ్యతిరేకంగా ఉందని.. కేవలం బందీల విడుదల కోసమే ప్రతిపాదన ఉందని.. కానీ యుద్ధం ముగింపునకు మాత్రం ఎలాంటి చర్చలు జరపలేదని హమాస్ నేత మీడియాకు వెల్లడించారు. అందుకే అమెరికా ప్రతిపాదనను తిరస్కరించినట్లు హమాస్ తెలిపింది.

వేద న్యూస్

ఆదివారం జూన్ 1, 2025

## తాళ్లపెల్లి నరేష్ గౌడ్‌కు డాక్టరేట్



**వేద న్యూస్, హన్మకొండ :**

కాకతీయ విశ్వవిద్యాలయంలో పొలిటికల్ సైన్స్ విభాగ పరిశోధకుడు తాళ్లపెల్లి నరేష్ గౌడ్ కు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కట్ల రాజేందర్ డాక్టరేట్ ప్రకటించారు. స్టేట్ ఆండ్ రూరల్ డెవలప్మెంట్ - ఏ స్టడీ ఆఫ్ వరంగల్ డిస్ట్రిక్ ఇన్ తెలంగాణ స్టేట్ అనే అంశం పై విభాగ ఆచార్య ప్రొఫెసర్ పోరిక సమ్మోలాల్ గారి పర్యవేక్షణలో పూర్తి చేసారు. షాపల్లి గ్రామం, జఫర్ గడ్ మండలం, జనగామ జిల్లాకు చెందిన డాక్టర్ తాళ్లపెల్లి నరేష్ గౌడ్ పరిశోధక విద్యార్థుల అధ్యక్షునిగా, తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, తెలంగాణ బీసీ గ్రాడ్యుయేట్స్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా పత్రాలు సమర్పించడం జరిగింది. తల్లి తండ్రులు తాళ్ళపెల్లి. సుశీల - స్వామి నిరుపేద కల్లుగీసే కుటుంబంలో జన్మించిన నరేష్ ఆర్థికంగా ఎన్నో సమస్యలను అధికమించి వ్యవసాయ కూలీగా పనిచేస్తూ చదువుకన్నారు.తన చెల్లెలు హేమలత సహకారంతో పై చదువులు చదవడం జరిగింది. అదే విధంగా గతంలో "రూరల్ డెవలప్మెంట్ ఇష్యూస్ అండ్ ఛాలెంజెస్ ఇన్ తెలంగాణ స్టేట్ " అనే పుస్తకాన్ని ప్రచురించారు. నేషనల్ ఒబిసి ఫెలోషిప్ కు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా తాళ్లపెల్లి నరేష్ ను పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు అభినందించారు.

## వేముల వీరేశానికి మంత్రి పదవి ఇవ్వాలి

■ మాజీ సర్పంచ్ చిన్న బోస్క ప్రసాద్



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన నకరికల్ శాసనసభ్యులు వేముల వీరేశానికి స్థానం కల్పించాలని కేతపల్లి మాజీ సర్పంచ్ చిన్న బోస్క ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం కేతేపల్లి మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సుదీర్ఘకాలంగా అణిచివేతకు గురవుతున్న మాదిగలకు మంత్రి పదవి విస్తరణలో భాగంగా వేముల కు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. నగరికల్ నియోజకవర్గంలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజల మన్ననలను పొందారన్నారు. ప్రతినిత్యం ప్రజల సమస్యల కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న నాయకుడు వేముల వీరేశం అని అన్నారు. ఉద్దీపన సంస్థను స్థాపించి సొంత డబ్బుతో నిరుపేదలకు, బడుగు బలహీన వర్గాల పిల్లలకు ఆంగ్ల మధ్యంలో ఉచిత విద్యను అందిస్తున్న ఆయనకు రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మంత్రి పదవి కేటాయించాలన్నారు. దళిత బిడ్డకు మంత్రి పదవి దక్కుతే నియోజకవర్గం ప్రజలకు మరిన్ని సేవలు అందుతాయని చెప్పారు.




## పదవీ విరమణ పొందిన పోలీస్ అధికారులకు సన్మానం

**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

జిల్లా పోలీస్ శాఖలో పనిచేయుటకు అవకాశం కలిగి ప్రజలకు సేవ చేయడం ఎంతో గర్వకారణమని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ శాఖలో దాదాపు 40 సంవత్సరాల కాలం పాటు విధులు నిర్వర్తిస్తూ నేడు పదవి విరమణ పొందుతున్న పోలీసు అధికారులు ఎస్ఐ ఎం.డి ఖాసీం, ఏ.ఎస్ఐ లు కె.నరసింహ రెడ్డి, పి.శేఖర్ లను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఘనంగా సన్మానించారు.పోలీసు శాఖకు అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రజలకు సేవలందిస్తూ పదవి విరమణ పొందడం అభినందనీయం అన్నారు. మీ యొక్క సేవలు, అనుభవాలు పోలీస్ శాఖకు చాలా అవసరం ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగికి పదవి విరమణ అనేది సహజం అని, పదవి విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో సుఖంగా ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. పదవి విరమణ పొందిన అనంతరం కూడా పోలీసు కుటుంబ సభ్యులేనని, ఏలాంటి ఇబ్బందులు, సమస్యలు ఉన్నా ఎల్లప్పుడు అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం వారికీ అందవలసిన ఆర్థిక సదుపాయాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏ.ఓ శ్రీనివాసులు, ఆర్.ఐ సంతోష్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు జయరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## రక్తదానం చేద్దాం..ప్రాణాలు కాపాడుదాం

■ కానిస్టేబుల్ మహేందర్ యాదవ్

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**




రక్తదానం చేయడమంటే ఇతరుల ప్రాణాలను కాపాడటమే అని కానిస్టేబుల్ చిలువేరు మహేందర్ యాదవ్ అన్నారు. అత్యవసర సమయంలో అర్ధరాత్రి వర్షం పడుతున్న సమయంలో కూడా రక్తదానం చేసి శభాష్ అనిపించుకున్నారు వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ చిలువేరు మహేందర్ యాదవ్. మెడికవర్ హాస్పిటల్లో సువర్ణ అని పేషెంట్ కు ఓపెన్ హార్ట్ సర్జరీ నిమిత్తం అత్యవసరంగా ఓ-నెగిటివ్ బ్లడ్ అవసరం ఉండగా బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్ వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు) చిలువేరు మహేందర్ యాదవ్‌కి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన మహేందర్ ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్‌లో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను 17వ సార్లు రక్తదానం చేసినట్లు తెలిపారు. రక్తం దానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని, అపోహలు తగ్గించుకుని రక్తదానం చేసేందుకు ముందుకు వస్తేనే రక్తం కొరత తీరి, ఎన్నో ప్రాణాలు నిలబడే అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా కానిస్టేబుల్ మహేందర్ యాదవ్ పిలుపునిచ్చారు. కాగా అర్ధరాత్రి సమయంలో కూడా రక్తదానం చేసిన చిలువేరు మహేందర్ యాదవ్ ను ఆపరేషన్ ఆర్.ఐ శ్రీనివాస్, ఆర్.ఎస్.ఐ రమేష్, సిటీ గార్డ్ మరియు పోలీస్ సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

# రాష్ట్ర అవతరణ దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

■ కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్



**వేద న్యూస్, సూర్యాపేట ప్రత్యేక ప్రతినిధి :**

జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తెజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్లోని కలెక్టర్ సమావేశ మందిరంలో శనివారం జూన్ 2న నిర్వహించే రాష్ట్ర అవతరణ వేడుకల సందర్భంగా వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ తేజస్ అదనపు కలెక్టర్ పి రాంబాబు తో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవన ఆవరణలో నిర్వహించే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలలో చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా వివిధ శాఖలు ప్రదర్శన స్టాళ్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.అమర వీరుల స్తూపం వద్ద, సభాస్థలి వేదిక ను పూలతో అందంగా అలంకరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.సభావేదిక, సీటింగ్ ఏర్పాట్లు చేయాలని, అవసరమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పోలీసు గౌరవ వందనంతోపాటు వేడుకలలో పోలీసు బందో బస్త్ ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని విద్యుత్ అధికారులకు సూచించారు. పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని డిఈఓ అశోక్ కు సూచించారు. వేడుకల ఏర్పాట్లలో ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు.అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాట్లపై అధికారులతో కలిసి పరిశీలించారు. స్టేజి స్టాల్స్ ఏర్పాట్లకు కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు కార్యాలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ వి అప్పారావు, ఏ ఆర్ డి ఎస్ పి నరసింహ చారి,ఎస్సీ కార్పొరేషన్ ఎడి శ్రీనివాస్ నాయక్,మైనార్టీ అభివృద్ధి అధికారి జగదీశ్ రెడ్డి,డి టి డి ఓ శంకర్ కార్యాలయ సుదర్శన్ రెడ్డి, డిప్యూటీ సీఈవో శిరీష,బీడబ్ల్యువో నరసింహారావు, మిషన్ భగీరథ ఇంజనీర్లు అరుణాకర్ రెడ్డి, శ్రీనివాస్, రాజశేఖర్,మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు,డిపిఓ యాదయ్య వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# టీజేఎఫ్ రజతోత్సవ వేడుకలకు తరలివెళ్లిన జర్నలిస్టులు

**వేద న్యూస్, శేరిలింగంపల్లి:**



హైదరాబాదులోని జలవిహార్ లో ఏర్పాటు చేసిన తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం (టీజేఎఫ్) 25 వసంతాల సంబురాల కార్యక్రమానికి శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. చందానగర్ పీజేఆర్ స్టేడియంలో పోస్టర్ ను విడుదల చేసి అనంతరం వాహనాల్లో బయలుదేరారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు పైళ్ల విఠల్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సాగర్, ఉపాధ్యక్షులు గంట్ల రాజిరెడ్డి, శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఉప్పరి రమేష్ సాగర్ మాట్లాడుతూ 2001లో ఏర్పడ్డ తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం (టీజేఎఫ్) తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిందని కొనియాడారు. తెలంగాణ కోసం కొట్లాడి రక్తం చిందించిన విషయాన్ని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం కోసం పలువురు జర్నలిస్టులు ఆత్మ బలిదానాలు చేశారని పేర్కొన్నారు. అప్పటి ప్రభుత్వ దమనకాండపై తమ కళాలతో ఎండగట్టారని తెలిపారు. జర్నలిస్టులపై ఉక్కుపాదం మోపిన పాలకులపై తిరుగుబాటు చేశారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఏర్పడిన తెలంగాణ జర్నలిస్టుల ఫోరం 25 వసంతాల సంబురాలు జరుపుకోవడం గర్వంగా ఉందని అన్నారు. తెలంగాణ మలిదశ ఉద్యమం నుంచి నేటి వరకు తెలంగాణ కోసం పోరాడుతున్న టీజేఎఫ్ ప్రస్థానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ సలహాదారు పులి అమృత్ గౌడ్, సీనియర్ జర్నలిస్టులు కె.శ్రీనివాస్ గౌడ్, అశోక్ యాదవ్, టెంజు సలహాదారు జి.రవీందర్ రెడ్డి, ప్రెస్ క్లబ్ మాజీ ప్రధాన కార్యదర్శి పుట్ట వినయ్ కుమార్ గౌడ్, టెంజు శేరిలింగంపల్లి ప్రధాన కార్యదర్శి కె.కిషోర్, శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్, టెంజు కార్యవర్గ సభ్యులు, జర్నలిస్టు నాయకులు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

# మహిళా శక్తికి నిదర్శనం అహల్య భాయ్ హెూల్కర్

**వేద న్యూస్,శాయంపేట :**




శాయంపేట మండల కేంద్రంలోని చేనేత సహకార సంఘంలో పుణ్య శ్లోక, లోకమాత రాణి అహల్య భాయ్ హెూల్కర్ 300 వ జయంతి ఉత్సవాన్ని బిజెపి మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి మిఠాయిలు పంచి ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ , రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాయరాకుల మొగిలి వీరు మాట్లాడుతూ మహిళల సాధికారత, చేనేత కార్మికుల కోసం అహల్యబాయి ఎంతో కృషి చేశారని వారి కోసం మహేశ్వర్‌లో చేనేత పరిశ్రమ స్థాపించి మహేశ్వర్‌లోని రాజవాడా గోడల డిజైన్లను ఆధారంగా తీసుకుని ప్రత్యేకమైన మహేశ్వరి సారీలను తయారు చేయాలని ఆమె ప్రేరణ ఇచ్చారు అన్నారు.ఈ సారీల తయారీలో సూరత్, మండవ వంటి ప్రాంతాల నుండి నైపుణ్యమైన చేనేత కార్మికులను మహేశ్వర్‌కు ఆహ్వానించి చేనేత పరిశ్రమకు ప్రోత్సాహం ఇచ్చి, స్థానిక మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించారూ. మహిళల కోసం ఉపాధి అవకాశాలు మహేశ్వర్‌లోని రెహ్వా సొసైటీ 1978లో స్థాపించి, అహిల్యాబాయి హెూల్కర్ వారసురాలైన రిచర్డ్ హెూల్కర్ , ఆయన భార్య సాలీ హెూల్కర్ ఆధ్వర్యంలో ప్రారంభించబడింది అన్నారు. ఈ సొసైటీ ద్వారా మహిళలకు చేనేత శిక్షణ, ఉపాధి అవకాశాలు, ఆరోగ్య సేవలు అందించబడుతున్నాయి అన్నారు. ప్రస్తుతం, ఈ సొసైటీ 250 మంది చేనేత కార్మికులతో కలిసి 110 లూమ్స్‌లో పనిచేస్తోంది. అహిల్యాబాయి హెూల్కర్ చేనేత పరిశ్రమను ప్రోత్సహించడానికి వివిధ చర్యలు తీసుకున్నారు అన్నారు. మహేశ్వర్‌లో చేనేత పరిశ్రమను అభివృద్ధి చేయడం ద్వారా, ఆమె స్థానిక మహిళల సంక్షేమం కోసం కృషి చేసింది అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు బాసాని నవీన్, కోమటి రాజశేఖర్, బత్తుల రాజేష్, మునుకుంట్ల రాజశేఖర్, మహిళలు పాల్గొన్నారు.

# వారసుడి న్యాయ పోరాటం

**మొదటి పేజీ తరువాయి**


కార్యక్రమాల న్నింటికీ హాజరయ్యాడు. అరవింద్ మేజర్ (18 ఏళ్లు) కాగానే ఆస్తిలో వాటా ఇస్తానని అరవింద్ నానమ్మ చెబుతూ ఉండేదని వెల్లడించారు. అరవింద్ నానమ్మ ఇటీవల మృతి చెందగా, అప్పటినుంచి తన ఆస్తివాటా కోసం వ్యవసాయ భూమి, ఇంటి వద్దకు వెళ్లగా, తన పెద్దనాన్న కరుణాకర్, బాబాయ్ రాజు.. గొడవకు దిగుతున్నారని పేర్కొన్నారు. "ఆస్తిలో వాటా లేదు " అని హెచ్చరిస్తున్నారని వెల్లడించారు.

తన తండ్రి మిట్టపల్లి సురేందర్ వాటాగా రావలసిన వ్యవసాయ భూమి, ఇంటి స్థలం తనకు ఇప్పించాలని అరవింద్ కోరుతున్నాడు. పెద్ద మనుషుల సమక్షంలో గతంలో మాట్లాడిన సందర్భంలో.. తనకు వాటాగా రావాల్సిన పావు తక్కువ మూడు ఎకరాలకు కాకుండా.. 30 గుంటలు, ఇంటి స్థలంలో ఐదు గంటలకు బదులుగా మూడు గుంటలు.. ఇస్తామన్నారని కానీ, ఇప్పుడు మాట మారుస్తూ అసలేం లేదని అంటున్నట్లుగా పేర్కొంటున్నారు.

న్యాయంగా తనకు రావలసిన ఆస్తి వాటాను ఇప్పించాలని బాధితుడు అరవింద్ గ్రామస్తులు, పెద్ద మనుషులను వేడుకుంటున్నాడు. ఆస్తి విషయమై తాను పెద్ద మనుషుల మధ్యకు పిలిపించినా, పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినా..తన పెదనాన్న, బాబాయ్ రావడం లేదని ఆరోపించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కొందరు మాట్లాడుతూ.. న్యాయంగా మిట్టపల్లి వంశాన్ని మోస్తున్న అరవింద్ కు వాటా ఇవ్వాల్సిందేనని అభిప్రాయపడ్డారు.

మిట్టపల్లి శ్రీనివాస్ మరణించిన సందర్భంలో ఆమె భార్య కడుపులో మూడు నెలల బాలుడుగా ఉన్న అరవింద్.. ఆ తర్వాత క్రమంలో బాలుడుగా పెరుగుతున్న సందర్భంలో.. తన నానమ్మ మాటలు నమ్మి.. పెద్దయ్యాక ఆస్తి వస్తుందని చిన్నప్పటి నుంచి వేచి చూస్తున్నాడని.. కానీ ఇప్పుడు ఆస్తి లేదని ఇవ్వబోమని, అరవింద్ పెదనాన్న, బాబాయ్ పేర్కొన్నడం సరికాదని చెబుతున్నారు. న్యాయంగా అరవింద్, ఆయన తల్లి మిట్టపల్లి వంశాన్ని మోస్తున్నందున.. వారికి రావలసిన ఆస్తివాటా తప్పనిసరిగా వస్తుందని, న్యాయవ్యవస్థ సైతం అలానే చేస్తుందని నమ్మకం ఉందని కొందరు స్థానికులు పేర్కొంటున్నారు. తన న్యాయమైన వాటా కోసం అరవింద్.. తన తల్లితో కలిసి టెంట్ వద్ద ఊరిలో.. నిరాహార దీక్షలు చేస్తుండడం.. చూస్తుంటే తమ గుండె తరుక్కుపోతున్నదని, రోజులుగా తిని తినక న్యాయం కోసం వారు పోరాడుతున్నారని చెబుతున్నారు.

## నేటి నుంచి ఒకేసారి మూడు నెలల బియ్యం



**వేద న్యూస్, నల్లగొండ ప్రత్యేక ప్రతినిధి :**

నేటి నుంచి జిల్లాలో 997 రేషన్ షాపులలో ఒకేసారి మూడు నెలల సన్న బియ్యాన్ని పంపిణీ చేయనున్నారని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వెంకటేష్ పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఉన్న 997 రేషన్ షాపులలో బియ్యాన్ని గోదాం పాయింట్లు నుండి రేషన్ షాపులకు తరలింపు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. కాగా నలగొండ జిల్లాలో 997 రేషన్ షాపులలో4,86,535 రేషన్ కార్డులు ఉండగా వారందరికీ లబ్ధి చేకూరుతుందని అన్నారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం జూన్ 1 నుండి 30 వరకు తప్పకుండా పంపిణి చేయాలని ఉత్తర్వులు జారీ చేసిందని స్పష్టం చేశారు. వర్షకాలంలో ప్రజలు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఒకేసారి మూడు నెలల బియ్యం పంపిణీ చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. ఐ ఎం జి పాయింట్లు నుండి రేషన్ షాపులకు బియ్యాన్ని తరలింపు ప్రక్రియలో అవకతవకలు జరగకుండా చూడాలని సంబంధించిన అధికారులకు ఆదేశించారు. డీలర్లు లబ్ధిదారులకు సకాలంలో అందుబాటులో ఉండి పంపిణీ చేయాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న రేషన్ షాపులు డీలర్లు ప్రచారం నిమిత్తం టామ్ టామ్ నిర్వహించాలని కోరారు. ప్రతి ఒక్క డీలరు నేటి నుంచి 30 వరకు షాపులను తెరిచి సక్రమంగా బియ్యాన్ని పంపిణీ చేయాలని ఆదేశించారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# న్యాయం కావాలి

**మొదటి పేజీ తరువాయి**

అధికారులకు కంప్లయింట్ చేసి 8 నెలలు దాటుతున్నా కనీస పట్టింపు లేకపోవడం సరికాదని, ఈ లెక్కన వ్యవస్థలో సామాన్యులకు న్యాయం అందడం, తప్పు చేసిన వారిపైన చర్యలు అంతంతమాత్రమేననే భావన ఏర్పడుతోందని పేర్కొన్నారు.

పూర్తి వివరాల్లోకెళితే బాధితుడు కృష్ణ తెలిపిన ప్రకారం.. బంధన్ హాస్పిటల్ వైద్యుల నిర్వాకం వల్ల తాను ప్రాణాపాయ స్థితికి వెళ్లి నెలలపాటు మంచానికి పరిమితం అయ్యానని బాధితుడు కృష్ణ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది జూలై 21న అపెండిక్స్ సమస్యతో బంధన్ ఆసుపత్రిలో అడ్మిట్ అయిన కృష్ణకు.. అదే రోజు సాయంత్రం 6 గంటలకు.. 4 గంటల పైనే వైద్యులు ఆపరేషన్ చేశారు. ఈ క్రమంలో పెద్ద పేగుకు రంధ్రం పడటంతో రోగి శరీరం మొత్తం ఇన్‌ఫెక్షన్ స్ప్రెడ్ అయి పరిస్థితి విషమించింది. ఒకరోజు తర్వాత అది గ్రహించిన కుటుంబ సభ్యులు.. వైద్యులను అడగగా.. ఎవరూ స్పందించకపోవడంతో.. ఆపరేషన్ వికటించిందని భావించి.. జూలై 23 రాత్రి వరంగల్ మెడికవర్ హాస్పటల్‌కు తీసువెళ్లారు. అక్కడ వైద్యులు రోగిని చెక్ చేసి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ కు తరలించాలని సూచించారు. దాంతో ఆ రాత్రే బేగంపేట మెడికవర్ హాస్పటల్‌కి వెళ్లి అడ్మిట్ అయ్యారు.

### పెద్దలతో 'బంధన్'కు బంధాలు..!

మెడికవర్ ఆస్పత్రికి చేరుకునే సరికి రోగి శరీరం మొత్తం ఇన్ఫెక్షన్ సోకి పరిస్థితి విషమించింది. మరో 6గంటలు ఆలస్యం అయితే ప్రాణానికి ప్రమాదమని అక్కడి సీనియర్ వైద్యులు తెలిపారు. అక్కడ ట్రీట్‌మెంట్ అనంతరం బాధితుడు కృష్ణ తన ఆరోగ్యం కొంత కుదుటపడిన తర్వాత బంధన్ హాస్పిటల్‌కి వెళ్లి తనకు జరిగిన అన్యాయంపై నిలదీశాడు. దానికి వైద్యులు నిర్లక్ష్యమైన సమాధానాన్నిస్తూ తమ వెనుక పెద్దపెద్ద రాజకీయ నాయకులు ఉన్నారని హాస్పటల్ రాజకీయ నాయకులదేనని బెదిరిస్తూ వస్తున్నారు. 'మా బంధన్ హాస్పిటల్ ఓపెన్ చేసింది కూడా ఓ మంత్రినే' అని తెలుసుకోవాలని బెదిరించినట్టు బాధితుడు ఆరోపించాడు. తనకు జరిగిన అన్యాయంపై బాధితుడు ఆధారాలతో హన్మకొండ డీఎంహెచ్‌వోకు, ఐఎంఏ వాళ్లకు ఫిర్యాదు చేశాడు. ఐఎంఏ పెద్దల ముందు తాము బాధితుడు కృష్ణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించామంటూ ఒప్పుకున్నారు. కానీ, ఆ హాస్పిటల్ మీద వైద్యులపై చర్యలు తీసుకునే అధికారం తమకు లేదంటూ ఐఎంఏ డాక్టర్లు స్పష్టం చేశారు.

### రిపోర్ట్‌కు ఇంకెంత టైం కావాలో?

అనంతరం బాధితుడు డీఎంహెచ్‌వోను గతేడాది నవంబర్‌లో సంప్రదించగా.. 16 డిసెంబర్ 2024న వరంగల్ ఎంజీఎం సూపరింటెండెంట్‌కు ఎక్స్‌పర్ట్స్(నిపుణుల) కమిటీ రిపోర్ట్ ఇవ్వాలని కోరారు. కానీ ఎంజీఎం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి నివేదిక రాకపోవడంతో బంధన్ హాస్పిటల్‌పై, వారి వైద్యులపై ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నామని అధికారులు తెలుపుతున్నారని బాధితుడు కృష్ణ వెల్లడించారు. ఈ ఏడాది కాలంలో బంధన్ హాస్పిటల్‌లో ఇలాంటి ఘటనలు రెండు..మూడు జరిగాయని, అందులో ఓ వ్యక్తి ఇటీవల మృతి చెందారని కృష్ణ వివరించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి త్వరితగతిన ఎంక్వయిరీ పూర్తి చేసి.. తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్నాడు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073